క్లుప్తంగా

పంచాయతీ అధికారిగా శేషాంజన్‌స్వామి

పర్వతగిరి : మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా శేషాంజన్‌స్వామి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శేషాంజన్ స్వామిని మండల పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పర్వతగిరి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హోమియో వైద్యాధికారి జోత్స్నా రాణి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం యోగా కార్యక్రమం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ రోజూ యోగా చేయాలని సూచించారు. తద్వారా బీపీ, షుగర్, మానసిక ఒత్తిడి అదుపులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఓ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగి తేలారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, ప్రభాకర్‌రావు, సూర్యనారాయణ, బెంజమెన్, సమ్మయ్య, వెంకట్రావు, నర్సయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన సతీశ్, రమేశ్‌లకు మంజూరైన రూ.68 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారికి కాంగ్రెస్ నాయకుడు బిక్కి మురళి గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. పేదలు అనారోగ్యం బారిన పడి కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించి ఆదుకుంటోందని తెలిపారు. గ్రామంలో రూ.68 వేల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్లగౌడ్, నాయకులు మహేశ్, చాంద్‌పాషా, లింగయ్య, దామోదర్, లాల్ సాహెబ్, షరీఫ్, పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ మల్లాడి వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో చెన్నారావుపేటలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఉద్యమకారులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారికి పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పిస్తామంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతోపాటు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని, రాజీవ్ యువ వికాస పథకంలో 20 శాతం కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్లు అందించి ఆదుకోవాలని కోరారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

నర్సంపేట : మావోయిస్టుల ఏరివేత పేరుతో చేపట్టిన కగార్ ఆపరేషన్‌ను నిలిపేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో తెలంగాణ రైతు కూలీ సంఘం, ఏఐకేఎంకేఎస్, రైతు కూలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 1న పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వారు గురువారం ఆవిష్కరించి మాట్లాడారు.

ప్రమాదకరంగా ముళ్లచెట్లు

- రోడ్డును కమ్మేస్తున్న కొమ్మలు
- భయాందోళనలో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పరకాల–హుజూరాబాద్ ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ముళ్ల చెట్లు

నడికూడ : సాధారణంగా రోడ్డుకిరువైపులా పచ్చదనం కంటికి ఇంపుగా కనిపిస్తూ ఉల్లాసభరిత వాతావరణంలో ప్రయాణం చేసేలా ఉటుంది. రాత్రి సమయంలో వాహనాల హైబీమ్ వెలుతురును అడ్డుకోవడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయి. కానీ రోడ్డు–భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారికిరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి 10 ఫీట్ల వరకు రోడ్డు పైకి అడ్డుగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్లచెట్ల కారణంగా నాలుగు లైన్ల రోడ్డు కాస్త రెండు లైన్ల రోడ్డుగా కనిపిస్తుందని పలువురు వాహనదారులు అంటున్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా పరకాల నుంచి హుజూరాబాద్ వరకు వివిధ రకాల మొక్కలను నాటిన అధికారులు వాటి సంరక్షణపై శ్రద్ధ చూపకపోవడంతో మొక్కలు ఎండిపోయాయని స్థానికులు విమర్శిస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్డు డివైడర్ మధ్యలో ముళ్లచెట్ల కొమ్మలు పెరిగి ప్రధాన రోడ్డుపై రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. రానున్న వర్షాకాలంలో ముళ్ల చెట్లు మరింత ఏపుగా పెరిగే అవకాశం ఉందని, దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవని, రోడ్డు ప్రమాదాలు జరుగకముందే అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా పలువురు తెలిపారు.

ముళ్ల చెట్లు తొలగించాలి



పరకాల–హుజూరాబాద్ ప్రధాన రోడ్డుకు అనుకుని పలు చోట్ల ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. రోడ్డు పైకి కొమ్మలు పెరిగి రావడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు దృష్టి సారించి వెంటనే ముళ్ల చెట్లను తొలగించాలి.

-బండి సుధాకర్, వ్యాన్ డ్రైవర్, శనిగరం

అధికారులు స్పందించాలి



ముళ్ల, కంప చెట్ల వలన రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు–భవనాల శాఖ అధికారులు దృష్టి సారించి ముళ్ల, కంప చెట్లను తొలగింపజేయాలి.రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

- దోమ పవన్, ముస్త్యాలపల్లి

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పరకాల : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. తక్షణమే మురికి కాల్వలో నిలిచిన నీటిని తరలించడంతో పాటు చెత్తను తొలగించాలని జావాన్‌ను ఆదేశించారు. వర్షాకాలంలో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజలు పారిశుద్ధ్య పనులపై ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారం కోసం చర్యలు చేపడుతామని అన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం తన కార్యాలయంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ భోగ రఘుపతితో కలిసి మున్సిపల్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ అమూల్య, మున్సిపల్ అధికారులు రవి, వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్స్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సురేశ్

ఐనవోలు : ప్రస్తుత వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఐఐఓఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం కేవీకే మామునూరు శాస్త్రవేత్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ.. 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ముందస్తు వ్యవసాయ ప్రణాళికతో పాటు కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలను రైతులకు వివరించారు. అనంతరం ఎంఏఓ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. అనంతరం రైతుల సమస్యలకు శాస్త్రవేత్తల బృందం సలహాలు, సూచనలు అందించారు. ఏఈఓ అనూష, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవకురాలు అలియాభాయ్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న నిశిధర్‌రెడ్డి

శాయంపేట : అలియా భాయ్ హోల్కర్ గొప్ప సామాజిక సేవకురాలని, ఆమె ప్రజలకు సంక్షేమ పాలన అందించారని భూపాలపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో అలియాభాయ్ హోల్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నిశిధర్‌రెడ్డి హాజరై కేక్ కట్‌చేసి చేనేత కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. భారత దేశ చరిత్రలో అత్యంత గౌరవనీయురాలైన మహిళా పాలకురాలు అలియాభాయ్ హోల్కర్ అని కొనియాడారు. ఆలయాల పునర్నిర్మాణం, సామాజిక సేవ కార్యక్రమాలు, మహిళా సాధికారత కోసం చేసిన కృషి ఆమెకు దక్కిందన్నారు. మరాఠా సామ్రాజ్యంలో ఇండోర్ ప్రాంతాన్ని పాలించిన ఆమె ప్రజలకు సంక్షేమం, న్యాయం, సమాజ సేవ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, నాయకులు దేవరాజ్, రాజు, నాగరాజు, నవీన్, చంద్రమౌళి, రాజశేఖర్, రమణారెడ్డి, విజయ్, శివ, మహేశ్, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పేలిన వీధి లైట్లు



శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బోరింగ్ వద్ద 11కేవీ విద్యుత్ లైన్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో 14 వీధి లైట్లు పేలిపోయాయి. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 11 కేవీ లైన్ ఎల్‌టీ లైన్‌పై పడడంతో లైట్లు, లైట్లకు ఉన్న గ్లాస్‌లు పగిలిపోయి మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. దీంతో 14 వీధి లైట్లు దగ్ధమైనట్లు పేర్కొన్నారు. బీసీ కాలనీ అంధకారమైనట్లు తెలిపారు. వెంటనే గ్రామపంచాయతీ అధి కారులు చొరవ చూపి నూతన లైట్లు బి గించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'యునాని'లో మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీడీ ప్రమీలదేవి

ఐనవోలు : ప్రభుత్వ యునాని వైద్యశాలలో మరింత మెరుగైన వైద్యం అందించాలని రీజినల్ డిప్యూటీ డైరక్టర్ (ఆర్‌డీడీ), వరంగల్ డాక్టర్ ప్రమీలదేవి అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని యునాని వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. వివిధ సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అదే విధంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 25 రోజుల పాటు యగా దశాబ్ది వేడుకలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ ఏడాది యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భానుప్రకాశ్, ఫార్మాసిస్ట్ శంకర్, యోగా శిక్షకులు అర్చన, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేసిన వ్యక్తి అరెస్టు



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఇటీవల చీకటి పద్మ ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ సతీశ్ బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపూర్ గ్రామానికి చెందిన నాగబోయిన శివరాజ్ తన ఆర్థిక పరిస్థితి బాగా లేదని ఈనెల 25వ తేదీన గ్రామంలోని చీకటి పద్మ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో నుంచి 8.5 గ్రాముల బంగారు నగలు, రెండు కేజీల వెండి ఆభరణాలు దొంగిలించి ఒక సంచిలో వేసి తన ఇంటి పక్కన పొదల్లో ఉంచాడు. ఉదయం బాధితురాలు ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో ఉన్న రికార్డుల ప్రకారం శివరాజ్‌ను అనుమానితుడి గుర్తించి దర్యాప్తు చేపట్టగా అతడు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ఆభరణాలను స్వాధీనం చేసుకుని శివరాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు త్వరగా ఛేదించిన హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఏసీపీ సతీశ్ బాబు, సీఐ సంతోశ్ అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక

శాయంపేట : మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య నూతన కమిటీని గురువారం ఎన్నికల అబ్జర్వర్స్ ప్రవళిక, కవిత ఆధ్వర్యంలో ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా గడిపె సుమలత, కార్యదర్శిగా అమ్మ వసంత, కోశాధికారిగా దాసరి కల్పనాదేవిని ఎన్నుకున్నారు. ఏపీఎం శ్రీధర్ రెడ్డి, సీసీలు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

మట్టిరోడ్డు కాదు..బీటీ రోడ్డే



పీచర నుంచి మల్కాపూర్‌కు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన పెద్దగుంతలో నిలిచిన వర్షపు నీరు

- ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



శాలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

వేలేరు : మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. రోడ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు, విస్తరణకు నోచుకోవడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు కంకర తేలి, మరోవైపు గుంతలు పడి ప్రమాదకరమైన మలుపులు ఉండడంతో ప్రయాణం నరకయాతనగా మారిందని వాపోతున్నారు. రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు గుంతలు కనిపించకపోవడం, వేగంగా ప్రయాణిస్తూ గుంతలు గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లపై ఏర్పడిన గుంతల నిండా వర్షపు నీరు చేరడంతో ఆదారి గుండా ప్రయాణించే వాహనదారులు గుంతల్లో పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

శిథిలావస్థలో జీపీ కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న గ్రామపంచాయతీ కార్యాలయం

వేలేరు : మండలంలోని కన్నారం గ్రామపంచాయతీ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పంచాయతీ సిబ్బంది భయాందోళన నడుమ విధులు నిర్వహిస్తున్నారు. జీపీ కార్యాలయం సుమారు 50 ఏళ్ల క్రితం పెంకులతో నిర్మించారు. గదులు మొత్తం పగుళ్లు తేలటం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గదుల్లోకి వర్షపు నీరు చేరి అధ్వానంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. మూడేళ్ల క్రితం అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ రూ.20 లక్షలతో కొత్త గ్రామపంచాయతీ నిర్మాణానికి భూమిపూజ చేయగా పనులు ప్రారంభించిన గుత్తేదారు స్లాబ్ నిర్మించి బిల్లులు రావడం లేదని పనులు మధ్యలోనే ఆపుదల చేశాడు. ఇప్పటికైనా కొత్తగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి



హారతి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఐనవోలు : సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండటంతో పాటు ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా సాయంత్రం గ్రామస్తులు సామూహిక బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



ప్రచారం చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు అన్నారు. మండల కేంద్రంలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లిస్తూ ఇబ్బందులు పడవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలలను కాపాడుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు లింగారావు, చంద్రయ్య, ప్రసన్న ఆనంద్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏఓ రాజ్‌కుమార్



రాజ్‌కుమార్, ఏఓ

కమలాపూర్ : నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామని ఏఓ రాజ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్ పొందిన డీలర్లు నాణ్యమైన కంపెనీ విత్తనాలు మాత్రమే విక్రయించాలని అన్నారు. అలా కాకుండా ఎవరైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు విక్రయించినా, గన్నీ సంచుల్లో విత్తనాలు తీసుకొచ్చి విడిగా కిలోల ప్రకారం అమ్మి రైతులను మోసగించాలని చూస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, విత్తనాల ఎంపిక, కొనుగోలుపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేని హెచ్‌టీ కాటన్ వంటి విత్తనాలు రైతులు కొనుగోలు చేయొద్దని అన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

ఎల్కతుర్తి : అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్ పరిశ్రమల జీఓలను సవరించడంలో నాన్చివేత ధోరణి అవలంభిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. అసంఘటిత కార్మికులైన హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకొచ్చిందని వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లా అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్కీం వర్కర్లను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల కన్వీనర్‌గా శనిగరపు రాజయ్య, కో కన్వీనర్లుగా రాజ్‌కుమార్, యాదగిరి, శ్రీకాంత్, కర్ణాకర్, రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మురళి

ఆత్మకూరు : రేపు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి పిలుపునిచ్చారు. మండలంలోని కటాక్షపూర్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31వ తేదీన వరంగల్‌కు వస్తున్న మంద కృష్ణమాదిగకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. అదే రోజు సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. మండల అధ్యక్షుడు రఘు, నాయకులు భిక్షపతి, మంద రవి, కలకోట రాజేశ్, రాజు మొగిలి పాల్గొన్నారు.